
ప్రజాశక్తి
బుధవారం 20 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం



వైద్య, ఆరోగ్య శాఖ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలకు సంబంధించిన సమస్యలపై స్థానిక వైద్య, ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈగ్రీవెన్స్‌కు 20 అర్జీలు ఉద్యోగుల నుంచి స్వీకరించారు. వీటిపై పరిశీలించి, చర్చించి తగు చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, సీనియర్ సహాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు టిడిపి సహాయ నిరాకరణ

- నెల్లిమర్ల నియోజకవర్గంలో దుస్థితి
- మౌనం వీడని బంగార్రాజు
- పొత్తులతో పార్టీ ఉనికి పోతుందంటూ
- తెలుగు తమ్ముళ్ల ఆవేదన



లోకం మాధవి



కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థికి టిడిపి నుంచి సహాయ నిరాకరణ కనిపిస్తోంది. జనసేన పార్టీ తరపున లోకం మాధవిని ప్రకటించి సరిగ్గా నెలరోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ఆమె వెంట తెలుగు దేశం పార్టీ నాయకులు గానీ, క్రియాశీలక కార్యకర్తలు గానీ వెళ్లలేదు. మరోవైపు ఈ సీటు టిడిపికి మాత్రమే కేటాయించాలని కొందరు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుకు మాత్రమే కేటాయించాలని మరికొందరు ప్రకటనలు చేశారు. నాలుగు మండలాలకు చెందిన కీలక నాయకులు ఏకంగా టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడ్ని నేరుగా కలిసి బంగార్రాజుకు న్యాయం చేయాలని కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో విజయనగరం పార్లమెంట్ స్థానం పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించినట్టు వార్తలు వెలువడడంతో ఈ నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లంతా అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ఎమ్మెల్యేకు కాకపోతే ఎంపీ స్థానానికైనా తమ పార్టీ తరపు అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేసుకోవచ్చని భావించామని, ఈ రెండు సీట్లూ జనసేన, టిడిపికి కేటాయించడం వల్ల నియోజకవర్గంలో ఏకంగా సైకిల్ గుర్తే కనిపించే పరిస్థితి లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ, లేదా ఎమ్మెల్యే సీటు టిడిపికి ఇవ్వకపోతే నెల్లిమర్ల అసెంబ్లీ స్థానంలో టిడిపి ఉనికి కోల్పోయే ప్రమాదం కూడా ఉందని చెప్తున్నారు. ఇలా టిడిపి నాయకులు, కేడర్ సహాయ నిరాకరణ, వ్యతిరేకత ప్రదర్శిస్తుండడంతో మాధవి యూటర్న్ తీసుకుని వైసిపిలోని కొంతమందిని ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే భోగాపురం మండలానికి చెందిన కాకర్లపూడి శ్రీనివాసరాజు వైసిపికి రాజీనామా చేసినట్టు సమాచారం. అందుకు తగ్గట్టే ఆయన క్యాంపు కార్యాలయంలోనే ఆయన అభిమానులు ఇటీవల జనసేనలో చేరారు. వ్యవహారం ముదురపాకాన పడుతున్నప్పటికీ టిడిపి, జనసేన రాష్ట్ర పార్టీ నేతలు పట్టించు కోకపోవడం అటు జనసేన, ఇటు టిడిపి కేడర్‌లో గందరగోళ పరిస్థితి నెలకుంది. పూసపాటిరేగ మండలంలో కూడా పలువురు వైసిపి సర్పంచులు జనసేనలో చేరేందుకు రంగం సిద్ధమవుతోంది. మరోవైపు బంగార్రాజు కూడా మౌనం వీడడం లేదు. కొద్దిరోజులపాటు స్తబ్ధతగా ఉండాలని పార్టీ కేడర్‌ను కోరారట. భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవరకు మౌనం వీడే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈలోపు ప్రత్యర్థి ప్రచారం, వ్యతిరేక నినాదంతో జనసేన అభ్యర్థి లోలోపల ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు భీమిలి నియోజకవర్గం అభ్యర్థికి టిడిపి అధిష్టానం పరిశీలిస్తున్న పేర్లలో బంగార్రాజు పేరు కూడా ఉందని ప్రచారం నడుస్తోంది. టిడిపిలో మిగిలిన సీట్ల భర్తీకి అభ్యర్థులను ఖరారు చేస్తే తప్ప నెల్లిమర్లలో పరిస్థితులు చక్కబడే పరిస్థితులు కనిపించడం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గోడ రాతలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడలపై రాతలకు అనుమతి లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఎన్నికల అంశాలపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించొద్దని ఆదేశించారు. హైవేలు, ప్రధాన రహదారుల పక్కన ఇప్పటి వరకు ఉన్న హోర్డింగ్‌లను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున నూతన అనుమతులు జారీ చేయరాదని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని అన్నారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ ఉండాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపర్చడం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంను విస్తృత స్థాయిలో వినియోగించడం, సివిజిల్ ద్వారా అందే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. మద్యం విక్రయాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇవిఎంల రాండమైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఐటిడిఎ పిఒలు, జెసి



ఇంటి గోడలకు ఉన్న రాజకీయ నాయకుల స్టిక్కర్లను తొలగిస్తున్న సిబ్బంది

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలో కల్పనా కుమారి, సి.విష్ణుచరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వెంకట రమణ, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, పలువురు నోడల్ అధికారులు, వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్టిక్కర్లు తొలగింపు

పార్వతీపురంటౌన్ : పట్టణంలో 41,42,43 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇళ్లపై ఉన్న రాజకీయ నాయకుల స్టిక్కర్లు, పోస్టర్లు తదితర అంశాల తొలగింపును సెక్టార్ అధికారి, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారి బి శ్రీనివాస రావు మంగళవారం చేపట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన అన్నారు.



పట్టుబడిన దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

చోరీ కేసులో ఒకరు అరెస్టు

మిగిలిన వారికోసం గాలింపు • పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం ఖడ్గవలస కూడలిలో ఒక ఇంట్లో జరిగిన చోరీ కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఒకర్ని అరెస్టు చేయగా, మరో ఐదుగురి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ విక్రాంతి పాటిల్ మంగళవారం తెలిపారు. ఈ కేసు సంబంధించి వివరాలను ఆయన తెలిపారు. ఫిబ్రవరి 26న గరుగుబిల్లి మండలం సంతోషపురం పంచాయతీలో గల ఖడ్గవలస జంక్షన్ సమీపన ఒంటరి గృహంలో నివసిస్తున్న కిమిడి శ్రీరామమూర్తి ఇంట్లో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ప్రవేశించారు. శ్రీరామ్మూర్తిని, ఆయన భార్య భాగ్య రత్నం దుండగులు కాళ్లు, చేతులు కట్టి, మూతికి ప్లాస్టర్ వేసి బీరువాలో ఉన్న సుమారు 87.5 తులాల బంగారాన్ని దుండగులు దోచుకుపోయారు. ఈ సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తు కోసం 4 ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డాయి. ఈ దొంగతనం కేసులో గరుగుబిల్లికి చెందిన ఒక వ్యక్తి, తూర్పు గోదావరికి చెందిన ఒకరు, బొబ్బిలి కి చెందిన ఒకరు ఈ దొంగతనానికి పథకం రచించి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను తెప్పించి ఆ ఇంట్లో దొంగతనం చేసినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇందులో ప్రధాన ముద్దాయిగా శంకరాపు నారాయణను గుర్తించారు. బొబ్బిలి రాజా కళాశాల మైదానం దగ్గర అతన్ని పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి దొంగలించబడిన బంగారంలో 18.87 తులాలు (220.700 గ్రాముల) స్వాధీనం చేసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ దొంగతనంలో పాల్గొన్న బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను, గరుగుబిల్లికి, తూర్పు గోదావరికి చెందిన వారిని పట్టుకోడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు బృందాలుగా వ్యవహరించిన పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, పార్వతీపురం రూరల్ సిఐ కె.రవికుమార్, చినమేరంగి సిఐ బి.మంగరాజు, సిసిఎస్సిఐ ఎం.అప్పారావు, ట్రైనీ డిఎస్పి మహమ్మద్ అజీజ్‌తో పాటు సహకరించిన పలు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలను ఎస్పీ ప్రశంసిస్తూ రివార్డులను ప్రకటించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డేలేదు...

- యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



దేవర శిర్లాం నుంచి ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సువర్ణముఖి నది గర్భంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా ఏ విధమైన అనుమతుల్లేకుండానే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలోని దేవంశిర్లాం సమీపాన ఇసుకరీచ్ ఉంది. దీనికి ప్రభుత్వం అనుమతితో ఇసుకను తోలుకునేందుకు ట్రాక్టర్లకు అవకాశం కల్పించారు. అయితే ఈ రీచ్‌కు అనుమతులు తీసుకున్నామంటూ అక్రమంగా కొత్తవలస ఎగువ భాగం నుండి వెంకట బైరిపురం, దేవరశిర్లాం ఎత్తిపోతల పథకాల వరకు సువర్ణముఖి నది గర్భమంతా యథేచ్ఛగా ఇసుకను దోచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గుడిలకు, గోపురాలకంటూ అబద్దాలు చెబుతూ తప్పించుకుంటున్నారు. ఇక్కడి నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రధాన రహదారి గుండా అక్రమంగా ఇసుక రవాణా సాగుతూనే ఉంది. ఆనకట్టలు, ఎత్తిపోతల పథకాలు సమీపాల్లోని నదుల్లో ఇసుక తీయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఇసుక మాఫియా వీటిని బేఖాతర చేస్తూ అక్రమంగా తరలించకపోతున్నా అధికారులు, పోలీసులెవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు

మాఫియా అతడే సూత్రధారి..?

సువర్ణముఖి నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా మాఫియాగా ఏర్పడ్డానికి సుమారు నాలుగు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులను ఏకం చేస్తూ మండలంలోని ఓ వ్యక్తి మాఫియాకు సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు ట్రాక్టర్లకు యాజమానిగా వ్యవహరిస్తున్న ఆ వ్యక్తి మిగతా వారిని కూడా తనకు అనువుగా కలుపుకొని ఈ దందాలో వారిని భాగస్తులుగా చేస్తున్నాడని వివిధ శాఖల అధికారులు కూడా ఆయన ద్వారా ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు మండలంలో వ్యాపించాయి.

రీచ్ వైపు చూస్తే డ్యామ్‌లో పడేస్తా?

ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతం వైపు వార్తాసేకరణకు ఏ ఒక్క విలేకరి వచ్చినా, అటువైపు కన్నెత్తి చూసినా ఆనకట్టలో పడేస్తామని మాఫియాకు చెందిన వ్యక్తి బెదిరింపు చర్యలకు పాల్పడుతూ, మరోవైపు తన అనుకూల వ్యక్తులతో ప్రచారం ముమ్మరం చేశాడు. ఇసుక మాఫియాకు అడ్డే లేదన్నట్లు ఈ ప్రచారంతో మరింత బలం చేకూర్చేలా ఉందని, ఇలాంటి బెదిరింపులకు దిగడం వెనుక బలమైన వ్యక్తులు అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయిజ

మడతోటరేవు ది మరో ట్విస్ట్

మండలంలోని వెంకటబైరిపురం ఎత్తిపోతల పథకం సమీపానున్న మడతోట రేవు ఇసుక రీచ్‌ది మరో కథ. ఇక్కడ నుంచి నాటు బండ్ల ద్వారా ఇసుకను సుమారు 100 మీటర్ల వరకు తోట వద్దకు ఇసుకను డంపు చేసి అక్కడ నుండి నేరుగా ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. నాటు బండ్ల యజమానులకు ఒక ట్రాక్టర్ ఇసుకను నింపేందుకు సుమారు రూ.800 అందజేస్తారు. ఎలాంటి పనుల్లేకపోవడంతో తాము ఇసుకను తరలించుకుంటూ జీవనం సాగిస్తున్నామని బండ్ల యజమానులు విలేకరులకు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ దందాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న మహిళలు

మహిళా హక్కుల ఎజెండాను పొందుపర్చాలి

మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి రాజకీయ పార్టీలు తమ ఎజెండాలో మహిళా హక్కుల ఎజెండాలను జోడించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు, సిపిఎం కేంద్రకమిటీసభ్యులైన మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సభలు పట్టణంలోని గెడ్డ వీధి, రామాపురం కాలనీ, బేరి వీధుల్లో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై రోజురోజుకు దాడులు జరుగుతున్నాయన్నారు. ఇందుకు నిదర్శనం మణిపూర్ పరిస్థితేనన్నారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చిన వాటి అమలులో లోపభూయిష్టంగా ఉందన్నారు. దీంతో మహిళలపై దాడులకు పాల్పడిన వారు చట్టాలను తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున మహిళా హక్కులపై ప్రతి రాజకీయ పార్టీ తమ ఎజెండాలో మహిళా హక్కులను జోడించాలని, మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో మహిళా హక్కు కోసం ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. తొలుత స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మహిళా హక్కుల ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా కమిటీ సభ్యులు ఎం.శివాని, ఎ.సరోజిని, సిహెచ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి అభ్యర్థులను చిత్తుగా ఓడించి

సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి - కురుపాం / గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో సిపిఎం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బి. శంకర్రావు అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మనుషుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి ఘర్షణలు గొడవలు సృష్టిస్తున్న మతతత్వ పార్టీ అయిన బిజెపిని, దానికి వంత పాడుతున్న టిడిపి, జనసేన, వైసిపిలను తరిమికొట్టి రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రమణ, కోలక అవినాష్, పలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ప్రజా వ్యతిరేక విధానాలతో, కార్పొరేట్ సంస్థలకు జాగీరుగా మారిన బిజెపికి నూకలు చెల్లాయని, అదే పార్టీతో పొత్తుపెట్టుకునే టిడిపి, జనసేన అభ్యర్థిని, వైసిపిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జియ్యమ్మవలసలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కొల్లి గంగనాయుడు మాట్లాడుతూ అరకు పార్లమెంట్, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇండియా కూటమిలో భాగంగా సిపిఎం పోటీ చేస్తుందని, కావున కార్యకర్తలంతా ముందుండి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. టిడిపి, జనసేనలు బిజెపితో పొత్తు పెట్టుకుని రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయన్నారు. విభజన హామీలు అమలు చేయని బిజెపితో టిడిపి ఎలా పొత్తు పెట్టుకుంటుందని, ప్రత్యేక హోదా కానీ, రైల్వే జోన్ కానీ, ఉత్తరాంధ్ర ప్యాకేజీ కానీ, అమరావతి రాజధాని కానీ దేనికి నిధులు ఇవ్వని బిజెపితో జతకట్టడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న చట్టాలను ఎత్తివేసి గిరిజనుల కొండలన్నీ మైనింగ్ పేరుతో కార్పొరేట్ పెట్టుబడుదారులకు బిజెపి అప్పజెప్పడానికి చూస్తుందని అన్నారు. గిరిజనులకు ఇస్తామన్న గిరిజన యూనివర్సిటీని ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. సమస్యలపై పోరాటం చేస్తున్న పార్టీలను, నాయకులను బిజెపి అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి అరెస్టులు చేస్తున్నారని, ప్రశ్నించే వారిని ఏళ్ల తరబడి ఎటువంటి విచారణ లేకుండా జైల్లో ఉంచుతున్నారని అన్నారు. అంతేకాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ఈ ఐదేళ్ల పాటు బిజెపికి తొత్తుగా వ్యవహరించారని, రాష్ట్ర హక్కులపై బిజెపితో పోరాటం చేయలేదని, ఇప్పుడు కూడా బిజెపిని పల్లెత్తి మాట అనకుండా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో ధరల పెరుగుదలకు కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని, ఎలాంటి అభివృద్ధి చేయని బిజెపికి అనుకూల విధానాలు తీసుకుంటున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గరుగుబిల్లి శ్రీను, ఎం.రామారావు, గౌరపాడు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

వారు సిపిఎం కార్యకర్తలు కాదు

గుమ్మలక్ష్మీపురం: మండలం కుక్కిడి పంచాయతీ చింతమానుగూడ, రుషినికాలనీకి చెందిన పలువురు సిపిఎం కార్యకర్తలు వైసిపిలో చేరినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోలక అవినాష్ ఖండించారు. వారు సిపిఎం కార్యకర్తలు కారని, వైసిపి వారని, ప్రచారం కోసం వైసిపి నాయకులే వారికి కండువాలు వేసి ఇలా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదని ఆయన దుయ్యబట్టారు.

రెండోరోజు పరీక్ష ప్రశాంతం

80మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాలో మంగళవారం రెండో రోజు పదో తరగతి పరీక్ష ఫలితాలు ప్రశాంతంగా ముగిసినట్లు డిఇఒ పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో రోజు జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో జరిగిన హిందీ పరీక్షకు 10550 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 10470 మంది హాజరయ్యారని, 80 మంది గైర్హాజరైనట్లు (99.24శాతం) తెలిపారు. మంగళవారం జరిగిన పరీక్షల తీరును డిఇఒ ఏడు కేంద్రాలను పరిశీలించగా, 29 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు పరిశీలించారని తెలిపారు.

ప్రశాంతంగా రెండోరోజు టెన్త్ పరీక్షలు

బలిజిపేట : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన బలిజిపేటలో ఏర్పాటుచేసిన ఎ, బి సెంటర్లలో 283 మంది, వంతరాం పరీక్షా కేంద్రంలో 128 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. రెండు పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు భద్రత కూడా ఏర్పాటు చేశామన్నారు.

15 మంది విద్యార్థులు గైర్హాజరు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు నీలానగరం, బిటివాడ, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన టెన్త్ హిందీ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఇఒ-1 డి.గౌరినాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో 141 మంది విద్యార్థులకు గానూ 132 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు గాను 184 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

పలుచోట్ల భారీ వర్షం

విజయనగరం : జిల్లాలో చీపురుపల్లి, బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, బొండపల్లి, గజపతినగరం, మెరకముడిదాం తదితర మండలాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చీపురుపల్లిలో సుమారు గంటన్నరపాటు ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కురుస్తున్న వర్షాన్ని చూసిన ప్రజలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఒక పక్క కనకమహాలక్ష్మి జాతరకు వచ్చిన బంధువులు, మరొక పక్క భారీ వర్షం కారణంగా జలమయంమైన రోడ్లతో ఇబ్బంది పడ్డారు.



డిఎంహెచ్ఒకు వినతిని అందజేస్తున్న ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది

ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియామక పత్రాల్లో ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీల్లో భాగంగా తమ సమస్యలు పరిష్కరించి 12 శాతం జీతాన్ని పెంచాలని ఎపి గిరిజన ఫీడర్ అంబులెన్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆర్.రాము, బి.ఈశ్వరరావు, జి.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణతో కలిసి డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావుకు ఆయన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 శాతం జీతం పెంచుతామని తమకు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఉందని, కానీ జీతం పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నియామక ఉత్తర్వుల కాపీ ప్రకారం 12 శాతం జీతం పెంచాలని, ఇఎంటిలకు ఏజెన్సీ అలవెన్స్, హౌస్ రెంట్ అలవెన్స్ ఇవ్వాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే తమ సర్వీసులను పరిగణలోకి తీసుకొని 45ఏళ్లు వయసు దాటిన ఉద్యోగులను ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎన్ఒ వార్డ్‌బోయ్, హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

టెన్త్ పరీక్షల నిర్వహణలో సమన్వయ లోపం విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-పాలకొండ

పదో తరగతి పరీక్షల నిర్వహణలో సమన్వయ లోపం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత విద్యార్థుల దగ్గర నుంచి పేపర్లు సేకరించడం, అవన్నీ ఒక దగ్గరకు చేర్చి పార్శిల్ చేయడానికి అదనంగా మరో 45 నిమిషాలు అయినా పడుతుంది. కానీ పరీక్షా కేంద్రం ఉన్న పాఠశాలకు ఒంటి పూట బడుల్లో భాగంగా మధ్యాహ్నం 12.45 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లాసులను నిర్వహిస్తారని విద్యార్థులకు చెప్పడంతో ఆ సమయానికి విద్యార్థులు పాఠశాలకు చేరుకుంటున్నారు. కానీ అప్పటికి ఇంకా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పాఠశాల లోపలికి విద్యార్థులను అనుమతించడం లేదు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు గేటు బయట ఎండలో పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాఠశాల యాజమాన్యం ఒకే తాటి మీదకు వచ్చి పరీక్షలు, పాఠశాల నిర్వహణ మధ్య సమయపాలన పాటించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న సీనియర్ విద్యార్థిని

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు వేడుక

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక వేదాంత జూనియర్ కాలేజ్ విద్యార్థుల వీడ్కోల వేడుకలు ఆటపాటలతో ఆహ్లాదంగా జరిగాయి. తమ తోటి సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ సిలబస్ కమిటీ ముఖ్య సభ్యులు, విశ్రాంతి అధ్యాపకులు గొర్ల త్రినాధం, ప్రజాకవి గంటేడ గౌర్నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రావీణ్యం సాధిస్తే ప్రపంచాన్నే జయించినంతగా తీర్చిదిద్దబడతారన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యత విద్యార్థులు గుర్తించాలన్నారు. క్రమశిక్షణతో బోధనలు అందించి ఐఐటి, ఎన్ఐటి, నీట్‌లలో అత్యుత్తమ ర్యాంకులు వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ విద్యార్థులు డాన్సులతో ఆహూతులను ఆనదింపజేశారు. కార్యక్రమంలో వేదాంత చీఫ్ మెంటర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న వైసిపి మండల నాయకులు

కళావతి గెలుపునకు సమిష్టి కృషి

ప్రజాశక్తి - భామిని

భామిని మండలంలో వైసిపికి పూర్తి స్థాయిలో మెజారిటీ ఓట్లు వచ్చేలా కృషి చేస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైసిపి సీనియర్ నాయకులు వండువలోని ఎంఎల్ఎ కార్యాలయానికి మంగళవారం వెళ్లి మూడో సారి నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ విశ్వసరాయి కళావతికి కేటాయించడం పట్ల అభినందనలు తెలిపారు. వైసిపి గెలుపునకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, గెల్లంకి రమేష్, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుబడ్డ కొండచిలువ రిజర్వ్ ఫారెస్టుకు తరలింపు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట పంచాయితీ వెంకమ్మచెరువు సమీపంలో మంగళవారం 15 అడుగుల భారీ కొండచిలువను గ్రామస్తులు గుర్తించారు. చెరువులోని రెళ్లగడ్డి పొదల్లో ఒక పిల్లిని నోట కరుచుకొని మింగుతున్న భారీ పామును చూసి పలువురు ఆకతాయిలు దాడి చేయబోగా, గ్రామస్తులు కల్పించుకొని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పార్వతీపురం అటవీశాఖ అధికారి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బోనులో పామును బంధించి, సమీపంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు.

ఘనంగా సిర్లి ఎల్లమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో మంగళవారం సిర్లి ఎల్లమ్మ తల్లి జాతరను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సిర్లి ఎల్లమ్మ ఆలయాన్నికి భక్తులు ఉదయాన్నే చేరుకొని బియ్యం, మినుములు, వేపపూలతో భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు.



క్యూలైన్లో ఉన్న యాత్రికులు

ఎన్నికల నియమావళి పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నిక నియమావళి విధిగా పాటించాలని జాయింట్ కలెక్టరు ఎస్-ఎస్. శోబిక అన్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు తహశీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బందితో జాయింట్ కలెక్టరు మంగళవారం వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపట్టినట్టు తెలిపారు. దీనిపట్ల అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఎక్కడా ప్రవర్తనా నియమావళి అమల్లో నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ఉద్యోగులెవరూ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరాదని అన్నారు. ఎన్నికల ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టేందుకు దృష్టి సారించాలని, ఎక్కడా లోపాలు ఉండరాదని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎంసిసి బృందాలు, వ్యయ ఖర్చులు, ప్రకటనలు, ప్రచారాలు, కార్యక్రమాలు ఇతర అంశాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టి, వీఎస్టీ, వీవీటీ, ఎస్-ఎస్‌టి బృందాలు తమ నివేదికను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయంలోగా పంపించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నియమాలు తు.చ తప్పక పాటించాలని ఆమె పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఎన్నికల నియమావళి పర్యవేక్షణ పక్కాగా ఉండాలనిఆదేశించారు. నివేదికల సమర్పణలో ఎటువంటి జాప్యం ఉండరాదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.


మక్కువ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పర్చాలని సాలూరు రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు తదితర ప్రచార సామగ్రి ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిహెచ్‌సితో పాటు వెంకటభైరిపురంలో పరిశీలించారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వం వహించరాదని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మక్కువలో జెడ్‌పి హెచ్‌స్కూల్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్



పాలకొండలో పర్యటిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శోబిక

వీరఘట్టం : ఎన్నికల కోడ్ తప్పనిసరిగా అంతా పాటించాలని సీతంపేట ఐటిడి పిఒ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించడంతో పాటు శిలాఫలకాలపై కూడా కాగితాలను అంటించాలని అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారితో పాటు తహశీల్దారు కె.జయప్రకాష్, ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయ ఎఒ వై.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి టివిఆర్ మూర్తి, సీనియర్ సహాయకులు ఎం.నాగభూషణ్, విఆర్ఒలు సురేష్ కుమార్, దుర్గారావు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఎన్నికల కోడ్ ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి హెచ్చరించారు. మంగళవారం పాలకొండ పట్టణంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. ఇంకా ఎక్కడైనా రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న శిలాఫలకాలను కూడా మూసివేయాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే పొత్తులు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ కలిసి పోటీ చేసినా రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఒకరిపై ఒకరు తీవ్రమైన ఆరోపణలు, విమర్శలు చేసుకున్న టిడిపి, జనసేన, బిజెపిలు ఇప్పుడు పొత్తులు పెట్టుకోవడం అధికారం కోసమేనని అన్నారు. 2014 ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌ను జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా విమర్శించారని చెప్పారు. లక్ష కోట్ల అవినీతికి టిడిపి పాల్పడినట్లు ఆయన ఆరోపించారని చెప్పారు. 2019 ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాని మోడీని చాలా దారుణమైన పదజాలంతో విమర్శించారని చెప్పారు. ప్రధాని మోడీ కూడా చంద్రబాబు నాయుడుపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారని, పోలవరం ప్రాజెక్టును ఎటిఎంలా వాడుకున్నారని చెప్పారు. అంతటి తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేసుకున్న మూడు పార్టీల నేతలు ఒకే వేదికపై కూర్చుని నీతి కబుర్లు చెపితే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి పని చేశారని, అందుకే పెత్తందార్లకు ఆయన తలవంచ లేదని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏదో రూపంలో మంచి చేస్తే తనకు మళ్లీ ఓటు వేయాలని, లేకపోతే ఓటు వేయొద్దని చెప్పిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో టిడిపి, జనసేన బిజెపి సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయని అన్నారు. కూటమి గెలిస్తే ప్రజలకేమి చేస్తామో చెప్పడం లేదని చెప్పారు. ఆచరణ సాధ్యం కాని సంక్షేమ పథకాలతో మరోసారి ప్రజలను మోసగించాలని కూటమి నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. కూటమి నాయకుల మాటలు నమ్మే స్థితిలో జనం లేరని అన్నారు. ఎంతమంది పొత్తులతో పోటీ చేసినా జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సిఎం కావడం తథ్యమని రాజన్నదొర చెప్పారు.

భవిష్యత్తుకు భరోసా ఇస్తాం : వైరిచర్ల

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబుతోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో మంగళవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరితో పాటు ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరేశ్ చంద్రదేవ్ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తుకు భరోసా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అంది న్యాయం జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరేయడానికి ప్రజలు, మహిళలు, యువత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు, టిడిపి, జనసేన నాయకులు వెంపటపు భారతి, పాడి సుధ, డొంకాడ రామకృష్ణ, ఎన్.వంశీ, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుపాంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి, వీరేష్‌చంద్రదేవ్



సీతానగరం : చినబోగిలిలో సూపర్‌సిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న విజయచంద్ర

చినబోగిలిలో ...

సీతానగరం : మండలంలోని చినబోగిలిలో మంగళవారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర బాబు షూరిటీ... భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిగుమ్మిలో...

పార్వతీపురంరూరల్: మండలంలోని పులిగుమ్మిలో మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో జరిగిన బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పాల్గొని ఇంటింట ప్రచారం నిర్వహించారు. అసమర్థపాలనతో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనుకకు తీసుకువెళ్లిన వైసిపి పాలనపై ప్రజలు విముఖంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, బి.లక్ష్మణరావు, బేత వెంకటరమణ, సర్పంచ్ బాలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు స్పష్టంగా ఉండాలి : డిఎంఒ

ప్రజాశక్తి - బెలగాం

జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికలు స్పష్టంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో జనరల్ ల్యాబ్, డెంగీ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను (ఎస్ఎస్ హెచ్) మంగళవారం తన వైద్య బృందంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో వచ్చిన వారికి వైద్యుల సూచనల మేరకు ల్యాబ్‌లో చేపడుతున్న మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షల వివరాలు, నివేదికలను రికార్డుల్లో పరిశీలించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వివరాలు స్పష్టంగా నమోదు చేసి డిఎంఒ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. అదే వివరాలు ఐహెచ్ఐపి పోర్టల్ లో ఆన్లైన్ నమోదు కచ్చితంగా ఉండాలని ల్యాబ్ సిబ్బందిని ఆదేశించారు. తద్వారా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ, నివారణా చర్యలు చేపడతామని తెలిపారు. డెంగీ నిర్ధారణ పరీక్షల పరికరాన్ని పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో రెండు డెంగీ నిర్ధారణ పరీక్షా (ఎస్ఎస్‌హెచ్) కేంద్రాలున్నాయని, రెండోది పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది డెంగీ ఎన్ఎస్-1 కిట్లు ఉపయోగించి ఆ జ్వర లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తారని, అందులో పాజిటివ్‌గా వస్తే ఆ పరిధిలో ఉండే సెంటినల్ సర్వలెన్స్ ఆసుపత్రి (ఎస్ఎస్‌హెచ్)కి వారి నమూనాలు పంపిస్తానని, అక్కడ ఎలీసా, ఐజిఎం నిర్ధారణ పరీక్షలు చేపట్టి అందులో పాజిటివ్‌గా వస్తే డెంగ్యూ గా నిర్ధారిస్తారని అన్నారు. అలాగే మలేరియాకు ఆర్డిటి, రక్త పూతల సేకరణ స్లైడ్‌ల ద్వారా నిర్ధారిస్తారన్నారు. ల్యాబ్‌లో సిబ్బందికి, ట్రైనీ సిబ్బందికి పలు వ్యాధులు, నిర్ధారణ పరీక్షలు గురించి వివరించారు. అనంతరం వార్డులో జ్వర లక్షణాలున్న వారిని సందర్శించి ఆరోగ్య పరిశీలన చేశారు. వారి నివాస పరిధికి చెందిన పిహెచ్‌సి సిబ్బంది ఆ ప్రాంతంలో ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్య బృందాన్ని ఆదేశించారు. ఆయన వెంట పార్వతీపురం సబ్ యూనిట్ అధికారి సిహెచ్.ధనుంజయరావు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ రామకష్ణ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

మతోన్మాద బిజెపిని ఓడించండి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. పాలకొండ ప్రజా సంఘాల సమావేశం సిఐటియు మండల కమిటీ కార్యదర్శి కాదా రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా దావాల రమణారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చారన్నారు. 44కార్మిక చట్టాలు రద్దుచేసి 4లేబర్ కోడ్లు వచ్చాయన్నారు. 2019 మోటార్ వెహికల్ చట్టం, 2020 విద్యుత్ చట్టం, హిట్ అండ్ రన్ చట్టం, ఉపాధి హామీ ని నిర్వీర్యం, సిఎఎ, ఎలక్ట్రోరల్ బాండ్లు, ధరల పెరుగుదల, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయడం తదితర విషయాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో వైఫల్యం ఉందన్నారు. అలాగే పంటలకు మద్దతు ధర కల్పించడంలో రైతులకు ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందన్నారు. ఈనేపథ్యంలో కేంద్రంలో మతోన్మాద బిజెపిని బలపరిచే పార్టీలను ప్రజలంతా వ్యతిరేకించాలని రమణారావు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సిహెచ్ సంజీవి, లక్ష్మణరావు, జి.సారిక, బి.వాణి తదితరులు పాల్గొన్నారు.



జీడిపంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

జీడి రైతులకు భరోసా ఏదీ?

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలోని జీడి గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన భరోసా ఎక్కడని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయితీ దంగభద్రలో జీడి తోటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి రైతులకు భరోసా ఎక్కడ? అధికారుల మాటలు రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపించినప్పటికీ సంబంధించిత పనులు మాత్రం ఐటిడిఎ కార్యాలయం దాటని పరిస్థితి లేదని తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, మక్కువ, పాచిపెంట, సాలూరు, పార్వతీపురం మండలాల్లో గిరిజన రైతులు ఎక్కువ జీడి తోటలు వేసి పండించే పరిస్థితి ఉందన్నారు. గిరిజనులకు జీడి పంట ప్రధానమైన పంట ఇంతకన్నా ముఖ్యమైన పంట మరొకటి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీడి పంటకు గిట్టిబాటు కల్పించే పరిస్థితి లేదన్నారు. అధికారుల వైఫల్యంతో దళారులు తమ ఇష్టమొచ్చిన రేటుకు జీడి పిక్కలు కొనుక్కొని మూడుపూలు, ఆరుకాయలుగా వ్యాపారం సాగిస్తున్నారని అన్నారు. జీడి తోటలకు మదుపు బాగా పెట్టినప్పటికీ అందుకు తగ్గట్టుగా ధరలేకపోవడంతో రైతులు అప్పుల పాలై నష్టాల బారినపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.

రాచర్లలో కాంగ్రెస్ ప్రచారం

బొబ్బిలి : మండలంలోని గిరిజన గ్రామం రాచర్లలో మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముువ్వల శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.

టిక్కెట్‌పై బెట్టింగులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎక్కడైనా గెలుపు కోసం బెట్టింగులు కాయడం చూశాం. కానీ ఎస్‌కోట నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం కోళ్ల లలిత కుమారి, గొంప కృష్ణ గ్రూపు సభ్యులు బెట్టింగులు కాయడం చర్చనీయాంశమైంది. తమ నాయకునికి టిక్కెట్టు వస్తాదని ఒకరు లేదు తమ నాయకురాలికే టిక్కెట్టు వస్తాదని మరో గ్రూపు నాయకులు లక్షల్లో బెట్టింగులు కాస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు రాజకీయ వారసురాలుగా రాజకీయంలోకి వచ్చి తనదంటూ ముద్ర వేసుకుని రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి టిడిపికి ఎస్ కోటను కంచుకోటగా మార్చిన సీనియర్ నాయకులు కోళ్ల లలిత కుమారికే ఈ సారి కూడా టిక్కెట్టు కేటాయిస్తారని ఆమె గ్రూపు బలమైన నమ్మకంతో బెట్టింగులకు దిగుతున్నారు. మరో పక్క ఈసారి యువకులకు అవకాశం కల్పిస్తున్నామని చంద్రబాబు గతంలోనే ప్రకటించడం, ఈ నేపథ్యంలో టిడిపి అభివృద్ధి కోసం పనిచేస్తున్న తానా ఫౌండేషన్ ప్రతినిధి గొంప కృష్ణను ఇక్కడకు తీసుకురావడంతో ఆయనకే కచ్చితంగా టిక్కెట్టు ఇస్తారని ఆయన గ్రూపు సభ్యులు బెట్టింగులు కాస్తున్నారు. గొంప కృష్ణ కూడా రైతులకు వ్యవసాయ కిట్లు పంపిణీ, విద్యాసంకల్పం పేరుతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్‌లో శిక్షణ తో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందారు. పైగా లలిత కుమారికే టిక్కెట్ ఇవ్వాలనుకుంటే ఇదివరకే ప్రకటించి ఉండాలని ఇప్పటివరకు ప్రకటించలేదంటే ఇక గొంప కృష్ణకే టిడిపి ఉమ్మడి అభ్యర్థి టికెట్ కేటాయిస్తారనే నమ్మకంతో ఆయన గ్రూపు బెట్టింగులకు దిగుతున్నట్లు తెలిస్తోంది. ఏది ఏమైనా ఒకటి రెండు రోజుల్లో ఎస్.కోట టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిని అదిష్టానం ప్రకటించే అవకాశం ఉన్నందున రెండు గ్రూపులకు చెందిన నాయకులు నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.



సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

పంటల వ్యర్థాలను తగులబెట్టకూడదు

ప్రజాశక్తి - పాచిపెంట

మొక్కజొన్న, వరి పంటల అనంతరం పంట వ్యర్థాలను తగులబెట్టకూడదని, దీనివల్ల భూమికి అందాల్సిన పోషకాలు అందకపోగా, పర్యావరణానికి హాని జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని పద్మాపురం, గురివిడినాయుడుపేటలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ పంటల అవశేషాలను భూమిలో కలియదున్నుకోవాలన్నారు. ఈ అవశేషాల్లో అనేక పోషకాలుంటాయని, వేసవిలో భూమిపై పొరను కప్పి ఉంచడం ద్వారా భూమి వేడెక్కకుండా ఉండడం వల్ల భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా ఎక్కువ కాలం ఉండడం వల్ల భూమి లోపల జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమవుతుందని అన్నారు. అలాగే పోషకాలు మిగిలి ఉన్న పంటల వ్యర్థాలను కలియదున్నుకోవడం ద్వారా భూమిలో ఉన్న సేంద్రియ పదార్థాలన్ని స్థిరీకరించవచ్చని రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ఈ పంటల వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. కావున రైతులంతా పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలో వైసిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కోటలో జరిగిన సమావేశంలో తనపై విమర్శలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రాజా మాటల్లో వాస్తవం లేదన్నారు.